


యువికా.. ప్రతిభకు వేదిక
8లో

అంతరిక్ష విజ్ఞానం, స్పేస్ అప్లికేషన్స్‌పై అవగాహన కల్పించేందుకు యువికా-2025 (యంగ్ సైంటిస్ట్) కార్యక్రమాన్ని భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రూపొందించింది.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహర్ సోమవారం (ఉదయం)
రాజమండ్రి	6.18	4.59
కాకినాడ	6.18	4.59
అమలాపురం	6.18	4.59

న్యూస్‌రీల్

మరొకరికి జీబీఎస్

కాకినాడ క్రైం: జీబీఎస్ వ్యాధితో మరో వ్యక్తి శనివారం జీజీహెచ్‌లో చేరాడు. ఏలేశ్వరానికి చెందిన 52 ఏళ్ల ఆ వ్యక్తి జీబీఎస్‌తో బాధపడుతున్నాడని వైద్యులు నిర్ధారించారు. దీంతో కలిపి జీజీహెచ్‌లో జీబీఎస్ కేసులు నాలుగుకు చేరాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఓ వ్యక్తి కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం ముగ్గురు చికిత్స పొందుతున్నారని వైద్యాధికారులు తెలిపారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడిని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి, పూజలు చేశారు. దీంతో ఆలయం వద్ద రద్దీ ఏర్పడింది. ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. మొత్తం 25 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారు. వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 4 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సత్యదేవుని ప్రాకార సేవ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. రత్నగిరిపై ఉత్తరాది భక్తుల సందడి ఇంకా కొనసాగుతోంది. ఏటా వీరు నవంబర్ నుంచి జనవరి వరకూ మాత్రమే వచ్చేవారు. ఈసారి మార్చి నెల వచ్చినా వస్తూనే ఉన్నారు. వారు వస్తున్న టూరిస్టు బస్సులతో కొండ దిగువన కళాశాల మైదానం నిండిపోతోంది.

శానిటరీ సమస్యకు తాత్కాలిక పరిష్కారం

అన్నవరం: రత్నగిరిపై శానిటరీ సమస్య తాత్కాలికంగా పరిష్కారమైంది. దేవస్థానానికి అవసరమైన పారిశుద్ధ్య సిబ్బంది సరఫరాకు గుంటూరుకు చెందిన కనకదుర్గా ఏజెన్సీతో ఒప్పందం కుదిరింది. దేవస్థానంలోని అన్ని విభాగాలు, సత్రాలు, ఆలయ ప్రాకారం, వ్రత మండపాలు, టాయిలెట్లు తదితర చోట్ల మొత్తం 349 మంది సిబ్బంది సేవలందించనున్నారు. వీరికి కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించేందుకు అంగీకారం కుదిరిందని దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరరావు తెలిపారు. వీరికి సంబంధిత ఏజెన్సీ ద్వారా నెలకు సుమారు రూ.52 లక్షల మేర వేతనాలు చెల్లించనున్నారు. శనివారం నుంచే ఇది అమలులోకి వచ్చింది. రెండేళ్లుగా దేవస్థానంలో హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ శానిటరీ పనులు చేస్తోంది. ఆ సంస్థ గడువు గత నవంబర్‌తోనే ముగియగా, నూతన సంస్థను ఎంపిక చేసేంత వరకూ కొనసాగాలని దేవస్థానం కోరింది. దీంతో గత నెలాఖరు వరకూ ఆ సంస్థ సిబ్బంది విధులు నిర్వహించారు. ఈ నెల ఒకటి నుంచి ఆ పనులు నిర్వహించలేమని ఆ సంస్థ దేవస్థానానికి లేఖ రాయడంతో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదేశాలతో తాత్కాలికంగా శానిటరీ సిబ్బందిని సరఫరా చేసే పనిని గుంటూరు కనకదుర్గా ఏజెన్సీకి అప్పజెప్పారు. ఫినాయిల్, యాసిడ్, లిక్విడ్స్, ఇతర శానిటరీ సామగ్రిని టెండర్ ద్వారా దేవస్థానం కొనుగోలు చేయనుంది. ఆలయ ఆవరణ కడగడానికి మెషీన్లు, వాషింగ్ మెషీన్లను కూడా కొత్త టెండర్‌దారు వచ్చేంత వరకూ కేఎల్‌టీఎస్ సంస్థవే ఉపయోగించనున్నారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని దేవస్థానాలకు ఉమ్మడిగా శానిటేషన్ టెండర్ పిలవనున్నారు.

పట్టాల పండగకు సర్వం సిద్ధం

- నేడు రంగరాయ వైద్య కళాశాల 62వ స్నాతకోత్సవం
- పట్టాలు పొందనున్న 248 మంది వైద్య విద్యార్థులు



రంగరాయ వైద్య కళాశాల

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాల 62వ స్నాతకోత్సవం ఆదివారం జరగనుంది. దీనికి కళాశాల సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ పర్యవేక్షణలో ఈ పట్టాల పండగ నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రాంగణంలోని ఆడిటోరియం పక్కన ఉన్న ఓపెన్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటలకు స్నాతకోత్సవ సంబరం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా 2019 బ్యాచ్‌కు చెందిన 248 మంది వైద్య విద్యార్థులకు డాక్టర్ పట్టాలు ప్రదానం చేయనున్నారు. ముఖ్య అతిథిగా ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య సంచాలకుడు, రంగరాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరు కానున్నారు. గౌరవ అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి హాజరవుతారు. విజయనగరం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి కూడా అతిథిగా పాల్గొంటున్నారు. ఐదున్నరేళ్ల విద్యలో అత్యంత ఉత్తమ ప్రతిభ కనబరిచిన డాక్టర్ ఎ.సాయి అనిరుధ్ స్నాతకోత్సవ భాషణానికి ఎంపికయ్యారు. డాక్టర్ విష్ణువర్ధన్ స్నాతకోత్సవ ప్రారంభోపన్యాసం ఇస్తారు. విద్యార్థులతో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఏవీఎస్ శశి వైద్య ప్రమాణం చేయిస్తారు. స్నాతకోత్సవ వేడుకకు 5 వేల మంది హాజరవుతారని అంచనా.

పోలవరం కాలువ పనుల అడ్డగింపు



పోలవరం కాలువ పనులు అడ్డుకుని ఆందోళన చేస్తున్న తాళ్లూరు గ్రామస్తులు, రైతులు

తుని రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాలువపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ తాళ్లూరు గ్రామస్తులు, రైతులు శనివారం మరోసారి ఆందోళన చేశారు. కాలువ తవ్వకం పనులను అడ్డుకున్నారు. అయినప్పటికీ ఉన్నతాధికారులు స్పందించ లేదు. ఎప్పటిలాగే డీఈ మురళి, ఏఈ వచ్చి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. బాధితులు ఆందోళన విరమించకపోవడంతో కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, పోలీసులతో అక్కడకు చేరుకుని, పనులు అడ్డుకోరాదని, ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ ప్రాజెక్టు పనులు అడ్డుకోవడం సరికాదని రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి అన్నారు. తమ సమస్యపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని, జిల్లా స్థాయి అధికారుల వద్దకు వెళ్లాలని చెప్పారు. అప్పటి వరకూ రోడ్డు మార్గాన్ని తొలగించబోమని తెలిపారు. ఇదే సమస్యపై గత నెల 25, 27 తేదీల్లో గ్రామస్తులు ఆందోళన చేయగా, బ్రిడ్జి నిర్మాణంపై అధికారులు ఎటువంటి హామీ ఇవ్వలేదు. ప్రత్యామ్నాయం పరిశీలిస్తామని అసిస్టెంట్ కలెక్టర్ భావన, పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి, పోలవరం ఇరిగేషన్ ఈఈ గోవిందు చెప్పారు. దీంతో, కలెక్టర్ వద్దకు వెళ్లి తమ ఇబ్బందులను వివరిస్తామని గ్రామస్తులు, రైతులు పేర్కొని ఆందోళన విరమించారు.

అందని ప్రసాదం

- రత్నగిరిపై మరింత జాప్యం
- అక్టోబర్‌లో పిలిచిన మొదటి టెండర్ రద్దు
- జనవరిలో మళ్లీ టెండర్లు
- రూ.18.98 కోట్లతో ఒకే ప్యాకేజీగా ఆహ్వానం
- 35 రోజులైనా ఖరారు కాని వైనం
- మరింత ఆలస్యం జరిగే అవకాశం



అన్నవరం: కేంద్ర ప్రభుత్వ 'పిలిగ్రిమేజ్ రీజువినేషన్ అండ్ స్పిరిట్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీముకు అన్నవరం దేవస్థానం ఏ ముహూర్తాన ఎంపికైందో కానీ ఆది నుంచీ అడుగడుగునా అవాంతరాలే ఎదురవుతున్నాయి. ఫలితంగా వస్తాయనుకున్న నిధులు రాక, రత్నగిరికి 'ప్రసాద్'ం అందడంలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. ఈ పథకం కింద రూ.20 కోట్లతో చేపట్టే నిర్మాణాలకు రీ టెండర్లు పిలిచిన 35 రోజులు గడిచినా ఇంకా ఖరారు కాలేదు. ఇవి మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రధాని శ్రీకారం చుట్టినా..

దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పదేళ్ల క్రితం ప్రసాద్ పథకానికి శ్రీకారం చుట్టింది. దీనికి అన్నవరం దేవస్థానం కూడా ఎంపికైంది. అప్పటి ప్రజాప్రతినిధులు దఫదఫాలుగా చేసిన విజ్ఞప్తులు, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, నాటి కాకినాడ ఎంపీ వంగా గీత తదితరుల కృషితో కేంద్ర ప్రభుత్వ అధికారులు అన్నవరం దేవస్థానాన్ని సందర్శించారు. ఇక్కడ చేపట్టాల్సిన పనులపై ఒక అంచనాకు వచ్చారు. ఈ క్రమంలో ఇక్కడి అధికారులు సుమారు రూ.100 కోట్లతో వివిధ పనులకు ప్రతిపాదించగా.. తర్వాత దీనిని సుమారు రూ.55 కోట్లకు, ఆ తర్వాత సుమారు రూ.20 కోట్లకు ఈ పనులను కుదించారు. ఆ మేరకు సుమారు రూ.20 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టే వివిధ పనులకు గత ఏడాది మార్చి 7న ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి లాంఛనంగా శ్రీకారం చుట్టారు. కొద్ది రోజులు గడిస్తే ఈ పనులను ప్రధాని ప్రారంభించి ఏడాది కానుంది. అయినప్పటికీ ఇప్పటికీ ఈ పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు.

'ప్రసాద్' పనులివీ..

- దేవస్థానంలోని పాత టీటీడీ భవనం స్థలంలో రూ.10 కోట్లతో రెండంతస్తుల అన్నదాన భవనం నిర్మాణం.
- ప్రస్తుతం అన్నదాన భవనం పక్కనే రూ.6 కోట్లతో క్యూ కాంప్లెక్స్.
- ప్రకాష్ సదన్ భవనం వెనుక ప్రస్తుతం పార్కింగ్ స్థలంగా ఉన్న ప్రదేశంలో అటు సత్యగిరి, ఇటు రత్నగిరికి దగ్గరగా ఉండేలా రూ.3 కోట్లతో టాయిలెట్ బ్లాక్‌ల నిర్మాణం.
- సత్రాల నుంచి ఆలయానికి, వ్రత మండపాలకు భక్తులను తరలించేందుకు రూ.కోటితో రెండు బ్యాటరీ కార్ల కొనుగోలు.

తొలుత రెండు ప్యాకేజీలుగా..

అన్నవరం దేవస్థానంలో ప్రసాద్ పనులపై గత ఏడాది అక్టోబర్ 9న రెండు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారు. మొత్తం 12 మంది కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేశారు. వీటిని అదే నెల 25న ఖరారు చేయాల్సి ఉండగా కూటమి సర్కార్ ఆ పని పూర్తి చేయలేదు. చివరకు గత డిసెంబర్‌లో ఆ టెండర్లను రద్దు చేశారు.

ఒకే ప్యాకేజీగా రీటెండర్

ప్రసాద్ పనులకు ఈ ఏడాది జనవరి 9న రీటెండర్ పిలిచారు. ఈసారి రూ.18.97 కోట్లకు ఒకే ప్యాకేజీగా టెండర్లు ఆహ్వానించారు. ఈసారి ఆరుగురు మాత్రమే టెండర్లు వేశారు. వీటిని జనవరి 24న తెరచి ఖరారు చేయాల్సి ఉండగా ఆ పని ఇప్పటి వరకూ జరగలేదు. ఫిబ్రవరి నెల కూడా గడిచిపోయినా దీనిపై ఇంతవరకూ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీనికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణమని అధికారులు చెబుతున్నారు.

'టెండర్' పెట్టేందుకేనని ఆరోపణలు

రాష్ట్రంలోని అన్ని పథకాల టెండర్లలో చక్రం తిప్పుతున్న కూటమి ప్రభుత్వ పెద్దల కన్ను రత్నగికి 'ప్రసాద్' టెండర్లపై కూడా పడిందనే ఆరోపణలు రెండు నెలలుగా వినిపిస్తున్నాయి. తమకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు ఈ టెండర్లు దక్కాలనే ఆలోచనతో కూటమికి చెందిన ఒక మంత్రి చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. ఆ విధంగా తమ అనుకూల కాంట్రాక్టర్‌కు పనులు దక్కే అవకాశం లేదని తేలినందువల్లనే తొలుత పిలిపించని టెండర్లను డిసెంబర్‌లో రద్దు చేశారనే ఆరోపణలు వచ్చాయి. రెండోసారి టెండర్లు దాఖలు చేసిన కాంట్రాక్టర్లలో అర్హత పత్రాలు జత చేయలేదనే కారణంతో టెక్నికల్ బిడ్ సమయంలో ఇద్దరిని అనర్హులను చేసినట్లు సమాచారం. ఈ విధంగా తమకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కే ఈ టెండర్లు దక్కేలా కూటమి నేత ఒకరు తెర వెనుక చక్రం తిప్పుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల కోడ్ వల్లనే..

అన్నవరం దేవస్థానంలో ప్రసాద్ స్కీమ్ పనులకు రీ టెండర్లను ఖరారు చేసే ప్రక్రియ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యమైంది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వీటిని ఖరారు చేస్తారు.

– ఈశ్వరయ్య, చీఫ్ ఇంజినీర్, పర్యాటక శాఖ

నేత్రపర్వం.. పుష్పయాగోత్సవం



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న పండితులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి వారి శ్రీపుష్పయాగోత్సవం శనివారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ రాత్రి స్వామి వారి కల్యాణం, 27న రథోత్సవం, 28న త్రిశూల స్నానం నిర్వహించగా, ఉత్సవాల ముగింపులో భాగంగా శ్రీపుష్పయాగోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పూలతో అలంకరించారు. వివిధ రకాల పండ్లు, మిఠాయిలు ఉంచారు. పూలమాలలతో అందంగా అలంకరించిన ఊయలలో స్వామివారి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి, పవళింపు సేవ నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు దంపతులు, ఈఓ బళ్ల నీలకంఠం దంపతులతో పాటు ఉత్సవ కమిటీ, భక్త కమిటీ దంపతులకు దంపత తాంబూలాలు అందజేశారు. ఉత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వారికి ప్రసాద వితరణ చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజలు నిర్వహించారు. శ్రీపుష్పయాగోత్సవాన్ని పురస్కరించుకొని కూచిపూడి గ్రామానికి చెందిన శ్రీసత్యకృష్ణ కూచిపూడి కళానిలయం కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.

నేడు జయలక్ష్మీ సొసైటీ బాధితుల సమావేశం

కాకినాడ రూరల్: జయలక్ష్మి సొసైటీ బాధితుల సంఘం సమావేశం ఆదివారం మధ్యాహ్నం స్థానిక చల్లా కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్ల పనితీరుపై చర్చించడంతో పాటు సభ్యుల అభిప్రాయాల మేరకు తీర్మానాలు చేస్తామని సంఘం అధ్యక్షుడు బదరీ నారాయణ తెలిపారు. అయితే, బాధితులకు అండగా పని చేస్తున్న తమపై నిందలు తగవని పాలకవర్గం చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు చెబుతున్నారు.

20 వేల మంది బాధితులు

సర్పవరం జంక్షన్ మెయిన్ బ్రాంచ్‌గా ఆరు జిల్లాల్లో దాదాపు 29 బ్రాంచ్‌లతో గతంలో ఏర్పాటైన జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ 2022 మార్చి 31న బోర్డు తిప్పేసింది. అప్పటి పాలవర్గం ఆర్థిక నేరాలకు పాల్పడడటంతో సుమారు 20 వేల మంది సభ్యులు వీధిన పడ్డారు. దీనిపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నాటి సహకార శాఖ మంత్రి కురసాల కన్నబాబు తీవ్రంగా స్పందించారు. బాధితులకు న్యాయం చేసేందుకు తక్షణం సిట్ ఏర్పాటు చేసి, ఈ కేసును సీఐడీకి అప్పగించారు. సీఐడీ అధికారులు గత పాలకవర్గం చైర్‌పర్సన్ విశాలాక్షితో పాటు డైరెక్టర్ జైలుకు పంపారు. బాధితులకు సొమ్ము తిరిగి ఇప్పించేందుకు అప్పట్లో భారీ రుణాలు తీసుకున్న వారి నుంచి రికవరీ కోసం కేసులు నమోదు చేశారు.

రుణ గ్రహీతలకు సంబంధించి 84 కేసుల్లో రూ.300 కోట్ల మేర ఆస్తులపై సీఐడీ అధికారులు చార్జిషీట్ దాఖలు చేశారు. మరో 110 కేసుల్లో రూ.200 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. వివాదాల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేసి 465 కేసులకు సంబంధించి రూ.497 కోట్లకు ఒక కేసు సివిల్ కోర్టులో, వాటిలో మరో 190 కేసులకు కోఆపరేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితుల్లో గంగిరెడ్డి త్రినాథరావు చైర్మన్‌గా నూతన పాలకవర్గం ఏర్పాటైంది.

పట్టించుకోని కూటమి


బాధితులకు న్యాయం చేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీలు గుప్పించినా నేటికీ న్యాయం జరగలేదు. రుణాల ఎగవేతదారుల ఆస్తులు స్వాధీనం చేసుకుని విక్రయిస్తేనే బాధితులకు సొమ్ము ఇచ్చేందుకు వీలవుతుంది. ఈ పరిస్థితుల్లో పాలకవర్గంపై బదరీ నారాయణ అవిశ్వాసం తీర్మానం చేసి, ఫిబ్రవరి 21న రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్‌కు నివేదించారు. దీనిపై కలెక్టర్‌కు కూడా శుక్రవారం వినతిపత్రం అందించారు.

అనేక విషయాల్లో నూతన పాలకవర్గం గోప్యత పాటిస్తోందని, అనుమానాస్పద రీతిలో వ్యవహరిస్తోందని ఆయన ఆరోపిస్తున్నారు. అయితే, తమ బోర్డు హయాంలోనే రూ.700 కోట్ల వరకూ సీఐడీ, ట్రిబ్యునల్ ద్వారా రాబట్టేందుకు కేసు వేశామని చైర్మన్ త్రినాథరావు చెబుతున్నారు.

బాధితుల సంఘం సమావేశం నేపథ్యంలో సర్పవరం జంక్షన్‌లోని మెయిన్ బ్రాంచ్‌లో చైర్మన్ త్రినాథరావు ఆధ్వర్యాన పాలకవర్గం శనివారం మధ్యాహ్నం భేటీ అయింది.

వరాల వసంతం

- నెలవంక దర్శనంతో ప్రారంభమైన పవిత్ర రంజాన్ మాసం
- ఉపవాస దీక్షలకు సిద్ధమైన ముస్లింలు
- తరావిహ్ నమాజ్ ప్రారంభం
- ఉమ్మడి జిల్లా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- విద్యుద్దీపాలతో శోభిల్లుతున్న ప్రార్థనా స్థలాలు



ఉపవాసం మినహాయింపు

సాక్షి, రాజమహేంద్రవరం: ముస్లింలకు సమస్త శుభాలూ కలిగించే పవిత్ర మాసం రంజాన్. శనివారం సాయంత్రం నెలవంక దర్శనంతో ఈ మాసం ప్రారంభమైంది. 'ఓ నెలవంకా! నీ దేవుడు, మా దేవుడు, అందరి దైవం అల్లాహ్ మాత్రమే' అంటూ ప్రార్థించి నెలవంకను ముస్లింలు వీక్షించారు. మసీదుల్లో ఇమామ్‌లు రంజాన్ మాసాన్ని ప్రకటించారు. దీంతో శనివారం రాత్రి నుంచే తరావీహ్ నమాజ్ ప్రారంభమైంది. ఆదివారం వేకువజాము నుంచి ఉపవాస దీక్షలను ముస్లింలు ప్రారంభిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎలాంటి ఆహారం, కనీసం నీళ్లు కూడా తాగకుండా కఠోర నిష్ఠతో దీక్ష పాటిస్తారు.

ఉమ్మడి 'తూర్పు'న ఆధ్యాత్మిక శోభ..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా దాదాపు 400 మసీదులున్నాయి. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మసీదులన్నీ ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి. రంగురంగుల విద్యుద్దీపాలతో శోభిల్లుతున్నాయి. ముస్లింలు రోజా, నమాజ్, జికర్, దువాలతో గడపనున్నారు. మసీదుల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంటోంది. సహెరి, ఇఫ్తార్ విందులతో హడావుడి కనిపించనుంది. ఉపవాస దీక్షలు ఆచరించేందుకు అవసరమైన నిత్యావసరాలను ముస్లింలు విరివిగా కొనుగోలు చేశారు.

ఉపవాసం ప్రత్యేకత

ఇస్లాంలో నాలుగో మూలస్తంభం ఉపవాసం. ముస్లిం సమాజం త్రికరణ శుద్ధితో ఆచరించే ఆరాధనా వ్రతమిది. ఎదుటి వారి ఆకలి విలువ గుర్తించాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. ఉపవాసాన్ని అరబీ భాషలో 'సౌమ్'గా, ఉర్దూలో 'రోజా'గా పిలుస్తారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం తొమ్మిదో నెల అయిన రంజాన్ మాసంలో ఈ ఆరాధన వ్రతాన్ని పాటిస్తారు. ఇస్లాం ధర్మశాస్త్ర పరిభాషలో సౌమ్ అంటే ఆగి ఉండటం . అంటే ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ తినడానికి, తాగడానికి, మనోవాంఛలకు దూరంగా ఉండటమని అర్థం.

ఉపవాసం మినహాయింపు

మనిషి బలహీనతలను, వారి కష్టసుఖాలను బాగా ఎరిగిన దైవం ఉపవాసాన్ని విధిగా నిర్ణయించినప్పటికీ, కొందరికి మినహాయింపులు కూడా ఇచ్చారు.

30 రోజులు ప్రత్యేకం

- రంజాన్ మాసంలో తొలి 10 రోజులు కారుణ్య దినాలు.
- 10 నుంచి 20 క్షమాపణ రోజులు,
- 20 నుంచి 30 వరకూ నరకాగ్ని నుంచి విముక్తి దినాలు.

చిన్న పిల్లలు, బాటసారులు, వ్యాధిగ్రస్తులు, వృద్ధాప్యం మరీ ఎక్కువైనవారు, మతిస్థిమితం లేనివారు, అశుద్ధావస్థలో ఉన్న మహిళలకు ఉపావాసం నుంచి మినహాయింపు ఉంది.

దివ్య ఖురాన్ అవతరణ మాసం

ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించి, సదా ఆచరించే దివ్య గ్రంథం ఖురాన్ ఈ మాసంలోనే అవతరించింది. ఇతర ప్రవక్తలపై ఫర్మానులు సైతం ఇదే నెలలో అవతరించాయి. అందుకే ఈ నెలకు అంత ప్రాధాన్యం. ఈ సమయంలో సైతాను బందీ అవుతాడని, నరక ద్వారాలు మూతపడి స్వర్గ ద్వారాలు తెరచుకుంటాయని ముస్లింల ప్రగాఢ విశ్వాసం.

తరావిహ్ నమాజ్ ప్రారంభం

రంజాన్ మాసంలో నెలవంక దర్శనమిచ్చినప్పటి నుంచే తరావిహ్ నమాజ్ ప్రారంభమవుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల్లో రంజాన్ మాసం ముగిసే (మళ్లీ నెలవంక దర్శనమిచ్చేంత) వరకూ ప్రతి రోజూ రాత్రివేళ నమాజ్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా రోజుకు ఖురాన్‌లోని కొన్ని అధ్యాయాలు చదివి వినిపిస్తారు. మాసం పూర్తయ్యేలోగా ఖురాన్ పఠనం పూర్తి చేస్తారు.

నాలుగు వాక్యాలే ప్రధానం

పవిత్ర రంజాన్ మాసంలో మహ్మద్ ప్రవక్త నాలుగు విషయాల్ని అధికంగా స్మరించాలని ఉపదేశించారు. వాటి ప్రాముఖ్యతను ధార్మిక పండితులు వివరిస్తారు. లాయిలాహ ఇల్లల్లాహ్, అస్తగ్ఫిరుల్లా.., అస్ అలుకజన్నత్, అవుజుబికమిన్నార్.. ఎక్కువగా పఠించాలి.

ప్రత్యేక ప్రార్థనలు

ముస్లింలు ఈ మాసమంతా ఆధ్యాత్మికంగా గడుపుతారు. ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనల్లో నిమగ్నమవుతారు. రోజూ సూర్యాస్తమయం వరకూ కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తారు. దానధర్మాలు చేస్తారు. ఐదు పూటలా నమాజ్‌తో పాటు తరావీ ప్రార్థనల్లో పాల్గొంటారు. 30 అధ్యాయాలున్న ఖురాన్‌ను నెల లోగా పఠించాలన్న ప్రవక్త ఆదేశాన్ని తప్పక పాటిస్తారు. పేదలకు సంపన్నులు జకాత్ చెల్లిస్తారు. చివరి పది రోజులూ ఇంటిని వదిలి మసీదుల్లో ఉంటూ దైవస్మరణ చేస్తారు. పండగకు ముందు ఫిత్రా ఇస్తారు. ఉపవాస సమయంలో జరిగిన తప్పులు, లోటుపాట్లకు ఈ ఫిత్రా పరిహారం. ఉపవాసాలు పాటించిన వారు, పాటించని వారు, చిన్నాపెద్దా అనే తారతమ్యం లేకుండా దానం చేస్తారు.

సంకల్పం

ప్రవక్త బోధించిన 'నవయతు అన్ అసుముగజన్ లిల్లాహి తాలా మిన్ సౌమిరమజాన్' అనే వచనాలు పఠించి ముస్లింలు ఉపవాస వ్రతానికి శ్రీకారం చుడతారు. ఉపవాస విరమణ సమయంలో 'అల్లాహుమ్మ లకసుంతు వబిక ఆమంతు, వ అలైక తవక్కత్తు, వ ఆలారిస్కిక అఫ్‌తర్‌తు ఫతఖబ్బల్ మిన్ని' అని వచిస్తారు.

సహర్

ఉపవాసం (రోజా) ఉండదలచిన వారు తెల్లవారుజామున 4 గంటల సమయంలో భోజనం చేస్తారు. దీనినే సహర్ అంటారు. సాయంత్రం వరకూ ఏ పదార్థాన్నీ తినరు. ఏదైనా కారణం వల్ల సహర్ తీసుకోకపోయినా వ్రతాన్ని మాత్రం ఆపరు.

ఇఫ్తార్

సూర్యాస్తమయం తరువాత ఏదైనా ఆహారం తీసుకుని ఆ రోజు దీక్షను విరమించడమే ఇఫ్తార్. ఖర్జూరాలతో ఇఫ్తార్ చేయడం ప్రవక్త సంప్రదాయం. అందుకే ముస్లింలందరూ ఖర్జూరాలతోనే ఇఫ్తార్ చేస్తారు. దీక్ష విరమించే సమయంలో ఉపవాసి దేనిని అర్థించినా అల్లాహ్ స్వీకరిస్తాడని ప్రగాఢ విశ్వాసం. ఉపవాసికి ఇఫ్తార్ ఇవ్వడం దైవసేవగా భావించి, విందు ఇచ్చేవారి పాపాలను దేవుడు క్షమిస్తాడని ముస్లింలు నమ్ముతారు.

ఉద్యోగినులకు 5, 6 తేదీల్లో ప్రత్యేక సెలవు

కాకినాడ సిటీ: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆటల పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 5, 6 తేదీల్లో ఉద్యోగినులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేతల అభ్యర్థన మేరకు సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లావ్యాప్తంగా 56 కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో తెలుగు, సంస్కృతం, హిందీ, ఒకేషనల్ జీఎఫ్‌సీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 22,774 మంది హాజరు కాగా, 857 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో జనరల్ ఫౌండేషన్ కోర్సు (జీఎఫ్‌సీ) పరీక్షలకు 1,775 మంది హాజరు కాగా, 118 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోలేదు. తొలి రోజు 24 పరీక్ష కేంద్రాలను స్క్వాడ్స్ తనిఖీ చేశాయి. ఆరు కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్స్ పర్యవేక్షించాయి. 144 సెక్షన్ విధించడంతో అన్ని పరీక్ష కేంద్రాల గేట్లను ఉదయం 9 గంటలకే మూసివేశారు. నగరంలోని పరీక్ష కేంద్రాలను ప్రాంతీయ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి నూకరాజు తనిఖీ చేశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదానికి కారణమైన కారు

కిర్లంపూడి: ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవరం గ్రామానికి చెందిన సుంకు నూకరాజు (47) అదే గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నాడు. స్థానిక పరిసర గ్రామాల్లో తన ట్రక్ ఆటోలో వాటర్ బాటిల్స్ డెలివరీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి యర్రవరంలో వాటర్ బాటిల్ వేసి తిరిగి వస్తుండగా సోమవరం జాతీయ రహదారిపై మలుపు తిరుగుతున్న సమయంలో రాజమహేంద్రవరం వైపు నుంచి వైజాగ్ వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న నూకరాజు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. దీంతో కార్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, పెళ్లైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు కుమార్తె టిక్కా సంగీత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

డ్రైవర్ దుర్మరణం

పి.గన్నవరం: స్థానిక కొత్త అక్విడెక్టుపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. మామిడికుదురు మండలం ఈదరాడకు చెందిన డ్రైవర్ ఇంజరపు దుర్గావెంకట నాగరామకృష్ణ (39) రాజమహేంద్రవరం నుంచి ఇంటికి ఆటోపై వస్తుండగా, మలికిపురం నుంచి ఆలమూరుకు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో రామకృష్ణ అక్కడిక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి రాజోలు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై బి.శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తేనెటీగల దాడి

సామర్లకోట: స్థానిక సీబీఎం సెంటర్‌లో తేనెటీగల దాడిలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం సీబీఎం సెంటర్‌లో కేబుల్ వైరు పనులు, చిరు వ్యాపారులు పనులు చేసుకొంటున్న సమయంలో ఆకతాయిలు చెట్టుపై ఉన్న తేనె పుట్టను కొట్టడంతో ఒకసారిగా తేనెటీగలు చెలరేగిపోయాయి. ఆ రోడ్డుపై ఉన్న వారిపై దాడి చేశాయి. దాంతో ప్రయాణికులతో పాటు చిరు వ్యాపారస్తులు, కేబుల్ టెక్నీషియన్లు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే సమీపంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు వెంటనే చికిత్స చేశారు.

యువికా.. ప్రతిభకు వేదిక

- ఇస్రో ఆధ్వర్యంలో యువ విజ్ఞాన కార్యక్రమం
- 9వ తరగతి విద్యార్థులకు చక్కని అవకాశం
- మార్చి 23 వరకూ దరఖాస్తులకు గడువు



రాయవరం: అంతరిక్ష విజ్ఞానం, స్పేస్ అప్లికేషన్స్‌పై అవగాహన కల్పించేందుకు యువికా–2025 (యంగ్ సైంటిస్ట్) కార్యక్రమాన్ని భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రూపొందించింది. అంతరిక్షంలో ఎలా ఉంటుంది.. ఉపగ్రహాల ప్రయోగం ఎలా చేస్తారు.. ఇలాంటి అంశాలపై శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడే అవకాశాన్ని విద్యార్థులకు కల్పిస్తుంది. వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 9వ తరగతి విద్యార్థులకు చక్కని తోడ్పాటు అందిస్తుంది. యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) పేరుతో అర్హులకు ఈ శిక్షణ ఇవ్వనుంది.

ప్రతిభావంతులకు..

విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై ఆసక్తి చూపి ఎందరో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారు. అటువంటి విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరుస్తున్నారు. వారి కోసం ఇస్రో ప్రత్యేకంగా యువ విజ్ఞాన కార్యక్రమాన్ని 'యువికా' పేరుతో నిర్వహిస్తోంది. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇస్రో.జీవోవీ.ఇన్‌లో ఈ నెల 24 నుంచి మార్చి 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. వచ్చిన దరఖాస్తుల నుంచి ఏప్రిల్ 7న మొదటి విడత ఎంపిక జాబితా విడుదల చేస్తారు.

అర్హతలివీ..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు యువికా–2025 దరఖాస్తుకు అర్హులు. 8వ తరగతి పూర్తి చేసి, ప్రస్తుతం 2024–25 విద్యా సంవత్సరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే దరఖాస్తుకు అవకాశముంది. విద్యార్థి విద్యాభ్యాస కాలంలో చూపించిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. రాష్ట్ర సిలబస్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు.

ఎంపిక పద్ధతి

8వ తరగతిలో పొందిన మార్కులు (50 శాతం), మూడేళ్లలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర/జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏదైనా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటే (2/5/10 శాతం), ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభకు (10 శాతం), ఒలింపియాడ్‌లో పాల్గొని పాఠశాల/ జిల్లా/ రాష్ట్ర స్థాయిల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి (2/ 4/ 5శాతం), రిజిస్టర్డ్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన వారికి (2/ 4/ 5శాతం), మూడేళ్లలో స్కౌట్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ప్రతిభ చూపిన వారికి (5 శాతం), గ్రామీణ ప్రాంతంలో చదువుతున్న వారికి (15 శాతం) మార్కులు ఇస్తారు. జాతీయ స్థాయిలో ఎంపికైన వారికి మే 18వ తేదీ నుంచి 30 వరకు ఆయా కేంద్రాల్లో పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తారు. ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ టీచర్‌కు కూడా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. శిక్షణ అనంతరం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లి అక్కడి విశేషాలను వివరిస్తారు.

దరఖాస్తు విధానం

నాలుగు దశల్లో విద్యార్థులు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మొదటగా ఈ–మెయిల్ ఐడీతో వివరాలు నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న 48 గంటల వ్యవధిలో ఇస్రో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. క్విజ్ పూర్తి చేసిన 60 నిమిషాల తర్వాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి సమర్పించాలి. మూడేళ్లలో వివిధ అంశాల్లో విద్యార్థి సాధించిన ప్రగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఏవైనా ఉంటే, వాటి జెరాక్స్ కాపీలపై విద్యార్థి సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తులు సమర్పించేందుకు మార్చి 23వ తేదీ వరకూ అవకాశముంది. ఎంపిక జాబితాను రెండు విడతల్లో ప్రకటించి అర్హత సాధించిన వారికి సమాచారం అందిస్తారు. యువికా శిక్షణకు ఎంపికైన వారికి శిక్షణకు హాజరయ్యేందుకు రవాణా చార్జీలు, బస, భోజన వసతితో పాటు అన్ని సౌకర్యాలను ఇస్రో కల్పిస్తుంది.

ఏడు శిక్షణ కేంద్రాల్లో..

విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏడు కేంద్రాలను ఎంపిక చేశారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్, బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఐఐఆర్ఎస్, డెహ్రాడూన్, సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం, శ్రీహరికోటలో ఎంపికైన విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.



సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులు కలలను సాకారం చేసుకోవడానికి ఇది చక్కని అవకాశం. దీనిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు ప్రయత్నించాలి. ఇస్రో పేర్కొన్న అర్హతలు కలిగి ఉన్నవారు దరఖాస్తు చేసుకునేలా సైన్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది మంచి మార్గం.

–జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

ఎంతో ఉపయుక్తం



యువికాకు అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి. శాస్త్రవేత్తలు కావాలనుకునే వారికి ఇది ఎంతో ఉపయుక్తం. ప్రశ్నించేతత్వమే ప్రయోగాలకు, శాస్త్రవేత్తలు కావడానికి కారణమవుతుంది. డీఈఓలు, డీవైఈఓలు, జిల్లా సైన్స్ అధికారులు, సైన్స్ టీచర్లు శ్రద్ధ తీసుకుని అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా చూడాలి.

–జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

మరోసారి మోసానికి తెరతీసిన కూటమి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ చూస్తుంటే మరోసారి మోసానికి తెరతీసినట్లు ఉందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలంటూ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఆ పథకాల అమలుకు కేటాయింపులు ఏమీ చేయలేదన్నారు. తల్లికి వందనం పథకానికి అరకొర నిధులు బడ్జెట్‌లో కేటాయించి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాలకు మేలు జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 143 హామీలను గాలిలో కలిపేసేలా బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఎమ్మెల్సీ విమర్శించారు. ఇందులో పేదల ప్రయోజనాలు కనిపించలేదని అన్నారు. అమరావతిని ప్రపంచ బ్యాంక్ ఇచ్చిన అప్పుతో అభివృద్ధి చేయనున్నారని, బడ్జెట్‌లో అదేదో కూటమి ప్రభుత్వం గొప్పలుగా చెబుతోందన్నారు. ఈ బడ్జెట్ డబ్బున్న వ్యక్తులకు, కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైందని చెప్పారు. రైతులు, చేనేత కార్మికులు ఇలా ప్రతి రంగానికి అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ నాయకుడు ముంగర ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక భారం మోపేలా బడ్జెట్


బుగత బంగార్రాజు, రాష్ట్ర కార్యదర్శి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలపై పన్నుల భారం మోపేలా ఉందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు విమర్శించారు. గత ప్రభుత్వం కంటే పథకాలకు, సంక్షేమానికి చాలా తక్కువగా నిధులు కేటాయించి, ఎన్నికల హామీలు అమలు చేస్తామనడం ప్రజలను మోసం చేయడమేనని వ్యాఖ్యానించారు. ప్రత్తిపాడు లిబరేషన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తలకు మించి హామీలిచ్చిన చంద్రబాబు తల్లికి వందనంలో నిర్దిష్టమైన విధానాన్ని ప్రకటించకుండానే కేటాయింపులు చేశారన్నారు. గత ప్రభుత్వం రూ.17 వేల కోట్లు అమ్మ ఒడికి కేటాయించి, ఇంటికి ఒకరికి అమలు చేస్తే... ప్రస్తుతం బడ్జెట్లో రూ. 1,500 కోట్లు కేటాయించి అందరికీ వర్తింపచేస్తాననడం బూటకం కాదా అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వం రైతు భరోసాకు రూ. 1800 కోట్లు, ఇరిగేషన్ శాఖకు రూ. 24.73 వేల కోట్లు, విద్యకు రూ. 11.03 కోట్లు, ప్రజారోగ్యానికి రూ. 6.02 కోట్లు కేటాయిస్తే... ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసాకు రూ. 900 కోట్లు, ఇరిగేషన్‌కు రూ. 23.98 కోట్లు, విద్యకు రూ. 10.9 కోట్లు, ప్రజారోగ్యానికి రూ. 0.98 కోట్లు కేటాయించడం చూస్తుంటే మౌళిక వసతులను నిర్లక్ష్యం చేసేలా ఉందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేంతవరకు ఇస్తానన్న నిరుద్యోగ భృతికి కేటాయింపులే లేవన్నారు. రాష్ట్రంలో 16,340 టీచర్ పోస్టులు డీఎస్సీ ద్వారా ప్రకటించారని, ఇది ముందుకు సాగే విధాన ప్రకటన లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు, 19 ఏళ్లు దాటిన మహిళలకు ఆసరా పథకానికి బడ్జెట్లో ప్రస్తావనే లేకపోవడం.. ప్రజలను దగా చేయడమేనన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అని చెబుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఇప్పటివరకూ కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా రాష్ట్రానికి తీసుకురాలేదన్నారు. సమావేశంలో అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

దినకర తేజ... ధరణీనాయక


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి


భక్తులతో పోటెత్తిన వాడపల్లి వెంకన్న ఆలయ ప్రాంగణం

- దారులన్నీ వాడపల్లి క్షేత్రానికే..
- ఒకేరోజు రూ.44.31 లక్షల ఆదాయం

కొత్తపేట: దినకర తేజా గోవింద.. ధరణీనాయక గోవింద అంటూ ఆ స్వామిని కీర్తిస్తూ భక్తజనం మురిసింది.. కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రం ఆధ్యాత్మిక చింతనతో బాసిల్లింది. ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే వాడపల్లి బాట పట్టారు. పావన గౌతమీ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, క్యూ లైన్లలో బారులు తీరి మరీ స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. తలనీలాలు సమర్పించారు. ఏడు శనివారాల వెంకన్న దర్శనం నోము ఆచరించే భక్తులు మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేశారు. అర్చకులు సుప్రభాత సేవతో ప్రారంభించి వివిధ సేవలు నిర్వహించారు. రంగురంగుల సుగంధ భరిత పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. స్వామి దర్శనం, తీర్థప్రసాదాల స్వీకరణ అనంతరం అన్నసమారాధనలో వేలాది మంది అన్న ప్రసాదం స్వీకరించారు. దేవదాయ– ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధర రావు ఆధ్వర్యంలో ఇతర అధికారులు, సిబ్బంది భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఈ ఒక్కరోజు దేవస్థానానికి సాయంత్రం 4 గంటల వరకూ రూ 44.31 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ఎస్ఐ ఎస్.రాము, వాడపల్లిలో ట్రాఫిక్ నియంత్రించి, బందోబస్తు పర్యవేక్షించారు. ఏపీఎస్ ఆర్టీసీ వివిధ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి వాడపల్లికి ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది.

వాలీబాల్ పోటీలో
విజేత ఇన్‌కమ్ ట్యాక్స్ చెన్నై


వాలీబాల్ ఫైనల్స్‌లో తలపడుతున్న ఇన్‌కమ్ ట్యాక్స్ చెన్నై, ఇండియన్ బ్యాంకు చెన్నై జట్లు

ఉప్పలగుప్తం: జాతీయ వాలీబాల్ పోటీల్లో ఇన్‌కమ్ ట్యాక్స్ చెన్నై జట్టు విజేతగా నిలిచింది. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో జరుగుతున్న అరిగెల శ్రీరంగయ్య మెమోరియల్ నేషనల్ మెన్ వాలీబాల్ టోర్నమెంట్ శనివారం రాత్రితో ముగిసింది. ఫైనల్స్‌లో ఇన్‌కమ్ టాక్స్ చెన్నై జట్టు తమ సమీప ఇండియన్ బ్యాంక్ చెన్నై జట్టుపై 26–24, 25–23, 25–22 తేడాతో వరుస మూడు సెట్లలో విజయం సాధించింది. ముంబయి హూపర్స్ మూడు, ముంబయి జీఎస్టీ జట్టు నాల్గో స్థానాలు దక్కించుకున్నాయి.

ప్రేక్షకుల హృదయాలను గెలిచేలా..

గెలుపు.. ఓటములను పక్కన పెడితే మొత్తం జాతీయ వాలీబాల్ పోటీలో ముంబయి జట్టు ప్రేక్షకుల మనసుల్లో విజేతగా నిలిచింది. ముంబయి హూపర్స్ జట్టులో ఎక్కువ మంది క్రీడాకారులు చెన్నై గల్లీ టీమ్ సభ్యులు. కానీ వారు జాతీయ క్రీడాకారులను తలదన్నేలా పోటీ పడ్డారు. ఈ జట్టు క్రీడాకారులకు కనీసం కాళ్లకు షూ కూడా లేవు. కానీ ప్రతి క్రీడాకారుడు అద్భుత ప్రతిభ కనబరుస్తూ ప్రేక్షకుల నుంచి జేజేలు అందుకున్నాడు. ఈ జట్టులో జర్సీ నెంబర్ సెవెన్ సెల్వన్ సెట్టర్‌గా ఉత్తమ ప్రతిభ పాటవాలు ప్రదర్శించారు. ఈ జట్టు టోర్నమెంట్‌లో మూడవ స్థానం దక్కించుకుంది. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు లక్కీ నారాయణ, డీఎస్పీ ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గొలకోటి ఫణి పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి గల్లంతు


సూర్యచంద్రం (ఫైల్)

పెరవలి: నిడదవోలు–నరసాపురం కాలువలో ప్రమాదవశాత్తూ ఓ వ్యక్తి పడిపోయి గల్లంతయ్యాడు. పెరవలి ఎస్సై వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. ఉండ్రాజవరం మండలం తాటిపర్రు గ్రామానికి చెందిన కె.సూర్యచంద్రం (45) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెరవలిలో శనివారం ఉదయం పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా బైక్‌తో సహా కాలువలో పడిపోయాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలువలో గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

అందుబాటులో అత్యాధునిక జ్యూయలరీ


కాకినాడ జోయాల్యూకాస్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): అత్యాధునిక జ్యూయలరీ కాకినాడ నగరంలోని జోయాల్యూకాస్ షోరూమ్‌లో అందుబాటులో ఉందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక దేవాలయం వీధిలో ఆధునీకరించిన జోయాలుక్కాస్ షోరూమ్‌ను శనివారం ప్రారంభించారు. ప్రజలకు నచ్చే అన్ని రకాల జ్యూయలరీ ఈ షోరూంలో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొండబాబు అన్నారు. జోయాలుక్కాస్ చైర్మన్ జోయాలుక్కాస్ మాట్లాడుతూ తమ షోరూమ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలు గల ఇంటీరియర్ డిజైన్స్ లభిస్తాయన్నారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్‌లు ఇస్తున్నామన్నారు. అనుగ్రహ, ప్రైడ్, ఎలిగంజా, యువ, అపూర్వ, రత్న కలక్షన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. గోల్డ్, డైమండ్స్ తాజా డిజైన్లు కూడా ఇక్కడ ఉన్నాయన్నారు.

మద్యం సీసాల ధ్వంసం

ముమ్మిడివరం: ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 3,607 లీటర్ల మద్యం సీసాలతోపాటు 776 లీటర్ల సారాను శుక్రవారం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. అమలాపురం డీఎస్పీ టీఎస్‌కే ప్రసాద్, ఎక్సైజ్ ఏఈఎస్‌జీ అమర్‌బాబు సమక్షంలో 322 కేసులకు సంబంధించి సుమారు రూ.25 లక్షల విలువైన సరకును ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. ముమ్మిడివరం సీఐ మోహన్ కుమార్, ఎక్సైజ్ సీఐ క్రాంతికుమార్, ఆయా స్టేషన్‌ల ఎస్సైలు పాల్గొన్నారు.